# లక్షరూపాయలు

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

కృష్ణకాంత్‌కి నాలుగోసారి మెలకువ వచ్చింది. అప్పటికే గంటన్నరకో మూడుసార్లు మెలకువ వచ్చినా లేవలేక మళ్లీ నిద్రలోకి జారిపోయాడు. ఈసారి వంటిమీద సూర్యరశ్మి పడుతుండటంతో కలిగిన అసౌకర్యంతో లేచాడు. రెండు కణతల దగ్గర ఎవరో సుత్తులతో కొడుతున్నట్లుగా బాధ. తలంతా దిమ్ముగా వుంది. కుడి అరిపాదం కూడా బాధగా వుంది.

నేలమీద అడ్డదిడ్డంగా పడుకుని వున్న కృష్ణకాంత్‌కి అకస్మాత్తుగా తను హైద్రాబాద్‌కి వచ్చిన పని గుర్తుకు వచ్చింది. దాంతోపాటు ఆ డబ్బు కూడా. పేంట్ బెల్ట్‌ని లూజు చేసి కుడివైపున్న రహస్య పాకెట్‌లో వేళ్లుంచాడు. ఖాళీగా వున్న ఆ జేబులోకి వేళ్లు శుభ్రంగా దూరాయి. అందులో వుండాల్సిన రెండు ఏభై వేల రూపాయల అయిదు వందల కట్టలు లేవు!

కృష్ణకాంత్ గుండె ఝల్లుమంది. అది తన డబ్బు కూడా కాదు. ఆఫీసు డబ్బు. వరంగల్ నుంచి క్రితం రాత్రి హైద్రాబాద్ వచ్చిన కృష్ణకాంత్ ఆ డబ్బుని తన బాస్ మేనమామకి ఇవ్వాల్సి వుంది. అయితే జూబ్లీ హిల్స్‌లోని బాబూరావు ఇంటికి వెళితే ఇంట్లో ఎవరూ లేరని తోటమాలి చెప్పాడు. డిన్నర్‌కి బయటకి వెళ్లారని, రాత్రి పదకొండు తర్వాత గానీ రారని చెప్ప డంతో వెనక్కి తిరిగాడు.

టైం ఎలా గడపాలో తెలీక ఒకే ఒక్క పెగ్గు తీసు కుందామని అమీర్‌పేటలోని ఓ చిన్న బార్‌కి వెళ్లాడు. కృష్ణకాంత్‌కి వెంటనే ఆ కొత్త వ్యక్తి గుర్తుకు వచ్చాడు.


బార్‌లో తను మొదటి పెగ్గు పూర్తి చేస్తుండగా ఒకతను వచ్చి అతని ముందున్న ఖాళీ సీట్లో కూర్చోవచ్చా అని అడిగాడు. అది ఇద్దరు మాత్రమే కూర్చునే చిన్న టేబుల్. తను ఎటూ బయల్దేరుతున్నాడు కాబట్టి సరేనన్నాడు కృష్ణకాంత్.

ఆ తర్వాత ఇంకో పెగ్, మరో పెగ్ తీసుకోవడం గుర్తుకు వచ్చింది కృష్ణకాంత్‌కి. తన భుజాల చుట్టూ అతను చేతులు వేసి బయటకి నడిపించుకుని వెళ్లడం, వెళ్తున్న అతని స్కూటర్ మీద కూర్చుని తను 'బారుకు పోదాం బీరులు తాగుదాం చలోచలో' అంటూ పాడటం గుర్తుకు వచ్చాయి.

ఆ కొత్త వ్యక్తి తనని ఎక్కడికి తీసుకెళ్లాడు? తన పేంట్ సీక్రెట్ పాకెట్‌లో డబ్బున్న సంగతి ఎలా తెలుసుకున్నాడు? తనే తాగిన మత్తులో వాగాడా?

హేంగోవర్ తాలూకు బాధ, తన బాస్ ఇచ్చిన ఆఫీస్ డబ్బు పోయిందన్న బాధతో కృష్ణకాంత్‌కి అసహనంగా వుంది. ఇలా జరిగిందని చెప్తే తన బాస్ నమ్మడు. ఆయనకు తాను ఆల్కహాల్ తాగుతాడని తెలీదు. ఆ డబ్బు తనే కావాలని కొట్టేసి నాటకం ఆడుతున్నాడనుకుంటాడు.

చుట్టూ చూశాడు. బండరాళ్లు. జూబ్లీహిల్స్‌లో కొత్తగా కట్టే ఇళ్లు అక్కడక్కడ కనబడుతున్నాయి. తన డబ్బు కొట్టేశాక అతను తన్నిక్కడ వదిలేసి వెళ్లిపోయా డన్నమాట. ఇంకా నయం చంపలేదు. దూరంగా ఓ చెరువు కనపడటంతో అక్కడికి వెళ్లి నీళ్లతో శుభ్రంగా మొహం, మెడ చుట్టూ కడుక్కున్నాడు. కాస్తంత తాజాగా ఫీలయ్యాడు. జేబులన్నీ తడుముకున్నాడు. ఇంకా ఏం పోయాయో అని. తన పర్స్, అందులోని డబ్బు, చేతి రుమాలు, తన బ్రహ్మచారి గది తాళం చెవుల గుత్తి అన్నీ వున్నాయి. వరంగల్ నుంచి బయలుదేరేటప్పుడు తన జేబులో లేని ఓ విజిటింగ్ కార్డు కొత్తగా బ్యాక్ పాకెట్‌లో కనిపించింది. దాన్ని చదివాడు.



యోగేందర్ అనే అతని విజిటింగ్ కార్డది. తనకి బార్‌లో గత రాత్రి తారసపడ్డ వ్యక్తి పేరు 'యోగి' అని చెప్పినట్లు గుర్తుకు వచ్చింది. అతని అడ్రస్‌ని బట్టి కూకట్‌పల్లిలో బంగారం దుకాణం నడుపుతున్నాడని గ్రహించాడు. తను బంగారం వ్యాపారం చేస్తున్నట్లు ఆ వ్యక్తి చెప్పిన సంగతి వలన గుర్తుకు వచ్చింది.

కృష్ణకాంత్‌కి అర్థమైంది తనేం చెయ్యాలో. సందేహించకుండా ఆటోలో సరాసరి ఆ కార్డులోని అడ్రస్‌కి చేరుకున్నాడు. ఆ దుకాణం ఇంకా తెరవలేదు. టైం ఏడున్నరే అవడంతో. అటూ ఇటూ చూసి దగ్గర్లో వున్న ఇరానీ రెస్టారెంట్‌కి వెళ్లాడు. వేడివేడి టీ తాగుతూ మధ్య మధ్యలో ఆ దుకాణం తలుపు వైపు చూడ సాగాడు. గంటంపావు తర్వాత ఆ దుకాణం ముందు స్కూటర్ ఆగడం, గత రాత్రి తన టేబుల్‌లో కూర్చున్న ఆ కొత్త వ్యక్తి దానిమీంచి దిగడం చూశాడు. కృష్ణకాంత్ మొహం అతన్ని చూడగానే కోపంతో జేవురించింది. ఒక్క ఉదుటున లేచి, తను తాగిన టీలకి, తిన్న బన్‌లకి డబ్బు చెల్లించి ఆ దుకాణం వైపు వేగంగా నడిచాడు. దుకాణానికి వున్న మూడో తాళం కప్పని తెరుస్తూ అలికిడికి తల తిప్పి చూశాడు యోగేందర్.

కృష్ణకాంత్‌ని చూడగానే యోగేందర్ మొహంలో ఆశ్చర్యం కనిపించింది. కృష్ణకాంత్ సన్నగా పీలగా వున్నా అతని చొక్కా కాలర్‌ని వెనక నించి పట్టుకున్నాడు. తర్వాత కోపం ఆపుకోలేక రెండుసార్లు నెత్తిమీద గుద్దాడు.

'ఏవిటిది?' అరిచాడతను.

'నిన్న రాత్రి నీవు చేసిన పనికి'.

'ఏం చేశాను? వదులు.' గింజుకున్నాడు యోగేందర్.

కృష్ణకాంత్ అతని చేతిలోని తోలు సంచిని లాక్కుని దాని జిప్ తెరిచాడు.

అయిదు వందల రూపాయల నోట్ల కట్టలు రెండు, వంద రూపాయల నోట్ల కట్టలు కొన్ని కనిపించాయి. కృష్ణకాంత్‌కి ఆ డబ్బు చూడగానే ఎక్కడ లేని రిలీఫ్ వచ్చింది.

'ఏయ్! ఏమిటిది?' అరిచాడతను.

'నీలాగా దొంగని కాను. నా డబ్బు మాత్రమే తీసుకుంటున్నాను.'

కృష్ణకాంత్ అయిదు వందల రూపాయల కట్టలని రెంటిని మాత్రమే తీసుకున్నాడు.

'నీ డబ్బేవిటి? అది నా డబ్బు. ఈ రోజు బాంబే నుంచి బంగారం బిస్కెట్లతో మా సప్లయర్స్ వస్తున్నారు.'


'ఏడిచావ్'.

మళ్లీ కోపంతో అతని నెత్తిమీద ఇంకోసారి గుద్దాడు కృష్ణకాంత్.

ఈసారి ఆ దెబ్బకి యోగేందర్ మళ్లీ తడబడి నేలకూలాడు. జిప్ బేగ్‌ని అతని పక్కనుంచాడు. ఉదయపు రష్‌లో జనం ఎవరి హడావిడిలో వారుండబట్టి ఇది ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు.

కృష్ణకాంత్ ఆటో ఎక్కుతూ చూశాడు యోగేందర్‌లో కదలిక రావడం. అతను లేచి కూర్చుని అటూ ఇటూ చూస్తుండగా కృష్ణకాంత్ ఆటో కదిలి వెళ్లిపోయింది.

సీట్లో చేరగిలబడి దీర్ఘంగా నిట్టూర్చాడు కృష్ణకాంత్. తన అదృష్టం బావుండి ఆ విజిటింగ్ కార్డు తన జేబులోంచి తీసేసుకోలేదు వాడు. తాగిన మత్తులో తను వరంగల్ నుంచి హైదరాబాద్‌కి ఎందుకు వచ్చాడో రాత్రి చెప్పి వుంటాడు. దాంతో స్కూటర్ మీద నిర్మానుష్యంగా వున్న చోటికి తీసుకెళ్లి ఆ డబ్బు తీసుకుని తన్నక్కడ వదిలేసి వెళ్లుంటాడు. మిగిలిన జేబులు వెదికి వుండడు. వెదికితే తన విజిటింగ్ కార్డుని వుండనిచ్చేవాడు కాదు. దైవం తన పక్షాన వుండటం అదృష్టం. వరంగల్ చేరుకోగానే భద్రకాళి ఆలయానికి వెళ్లాలనుకున్నాడు. అతని కుటుంబ సభ్యుల ఇలవేల్పు ఆ దైవం.



ఆటో జూబ్లీహిల్స్‌లో తన బాస్ బంధువు ఇంటి ముందు ఆగాక ఆటో దిగి చెప్పాడు.

'ఉండు. అయిదు నిముషాల్లో వస్తాను. నన్ను మళ్లీ బస్ డిపోలో దింపుదువుగాని.'

'సరే సాబ్'

కృష్ణకాంత్ ఆ ఇంట్లోకి నడిచాడు. హాల్లో నాలుగైదు నిముషాలు వేచి వున్నాక లోపల నుంచి ఆయన వచ్చాడు. కృష్ణకాంత్ వంక అసహనంగా చూస్తూ అడిగాడు.

'ఏవిటి?'

ఆయన చికాకుకి కారణం తనింకా డబ్బివ్వకపోవడమే అని అర్థం చేసుకున్న కృష్ణకాంత్ వినయంగా చెప్పాడు.

'సారీ సార్! లేటయినందుకు. నిన్న రాత్రి ఎనిమిదిన్నరకి వస్తే తమరు డిన్నర్‌కి బయటకి వెళ్లారని, అర్ధరాత్రికి కానీ రారని మీ తోటమాలి చెప్పాడు. ఇదిగోండి. ఈ లక్ష మీకిమ్మని మా బాస్ పంపారు నన్ను.'

చికాకు స్థానంలో ఆయన మొహంలో మరుక్షణం ఆశ్చర్యం ప్రవేశించింది.

'అంటే, నిన్న రాత్రి ఎంత తాగావంటే అసలేం జరిగిందో నీకు జ్ఞాపకం లేదా!'

'జ్ఞాపకమా సార్?' అయోమయంగా ప్రశ్నించాడు కృష్ణకాంత్.

'నిన్న రాత్రి ఒకటిన్నరకి నీవు, నీ ఫ్రెండ్ స్కూటర్ మీద వచ్చి నన్ను నిద్ర లేపారు. అక్షరాలా లక్ష రూపాయలు నాకిచ్చి,

'ఇది మీకు ఇస్తేగానీ నాకీ రాత్రి నిద్రపట్టదు సార్! అని చెప్పావు. లక్ష ముట్టినట్లు రసీదు ఇస్తానుండమంటే నా మాటలు పట్టించుకోకుండా నీ ఫ్రెండ్ స్కూటర్ మీద 'బారుకు పోదాం బీరులు తాగుదాం చలోచలో' అంటూ పాడుకుంటూ వెళ్లిపోయావు' చెప్పాడాయన. ○